andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.6, కనిష్ఠం 25.9



నిర్మల్
జిల్లా వార్తలు

శుక్రవారం 29 మార్చి 2024

వాహనాల ముమ్మర తనిఖీలు

ముధోల్, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికలకోడ్ నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ముధోల్ - భైంసా రహదారిపై పోలీసులు ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. అక్రమ నగదు, మద్యం సరఫరా నివారణకు పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలను పాటించాలని ఎస్సై మోహన్‌రావు అన్నారు.

జిల్లాలో టూరిజంపై నిర్లక్ష్యం



జిల్లా కేంద్రంలోని శ్యాంఘడ్ కోట

- పర్యాటక ప్రదేశాల్లో కరువైన సౌకర్యాలు
- నిలిచిపోయిన హరిత రిసార్ట్ పనులు
- పర్యాటకానికి నిధుల కొరత
- ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలంటున్న స్థానికులు
- కొత్త సర్కారుపైనే ఆశలు

నిర్మల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అపారమైన ప్రకృతి వనరులు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలకు నెలవుగా ఉన్న జిల్లాను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం టూరిజం కారిడార్ ఏర్పాటుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించింది. ఇందు లో భాగంగానే అప్పటి పర్యాటకశాఖ కమిషనర్ సైతం నిర్మల్ జిల్లాలోని టూరిస్ట్ ప్రాంతాలను సందర్శించి కారిడార్‌కు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందింపజేశారు. దాదాపు 50 కోట్ల రూపా యలతో ఈ టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను కలుపుతూ రూట్‌మ్యాప్‌ను సైతం సిద్ధం చేశారు. రైల్వేసౌకర్యం ఉన్న బాసర నుంచి ఇటు కవ్వాల్ అభయారణ్యం అటు కుంటాల వాటర్‌ఫాల్ వరకు ఈ రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. నిర్మల్ టౌన్‌ను కేంద్రంగా చేసు కొని మూడు వైపులా ఈ టూరిజం కారిడార్‌ను అనుసంధానం చే యాలని తలపెట్టారు. ఇందులో భాగంగానే బాసర సరస్వతీదేవి ఆలయ అభివృద్ధికి 50 కోట్లతో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేశారు. దీ నికి అనుగుణంగా ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని అప్పట్లో భావించారు. బాసర సరస్వతీదేవి ఆలయం నుంచి మొదలు కొని మార్గమధ్యంలోని కదిలి పాపహరేశ్వరాలయం, కాల్వలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మామడ మండలంలోని చారి త్రక బూరుగుపల్లి రాజరాజేశ్వరాలయాన్ని లింకప్ చేశారు. అలాగే నిర్మల్ టౌన్‌లోని గండిరామన్న సాయిబాబా మందిరం మల్లన్న గుట్ట హరిహరక్షేత్రంను ఈ కారిడార్ పరిధిలోకి చేర్చారు. చారిత్రక దేవాలయాలన్నింటిని సందర్శించే విధంగా టెంపుల్ కారిడార్‌ను రూ పొందించిన అధికారులు ఇక సహజ సిద్ధమైన ప్రకృతి వనరులు, కోటలు, బురుజులను కలుపుతూ ఈ కారిడార్‌ను విస్తరించారు. నిర్మ ల్‌టౌన్‌లోని శ్యామ్‌ఘడ్, బత్తీస్‌ఘడ్‌లను అభివృద్ధి చేసి పర్యా టకులను ఆకట్టుకోవాలని భావించారు. దీనికోసం గాను ఈ రెండు హోటళ్ల వద్ద కొంతమేర పనులు కూడా చేపట్టారు. ముఖ్యంగా శ్యామ్‌ఘడ్ వద్ద ఆకర్షణీయమైన లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అలా గే కోట లోపల కూడా కొంత అభివృద్ధి పనులను చేపట్టారు. దీంతో పాటు ఈ కోట వద్ద పర్యాటకశాఖ ఓ టూరిస్ట్ ప్లాజాను కూడా నిర్మించింది. పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఈ కోటను సందర్శించేందుకు పర్యాటకులు వెనుకాడుతున్నారు. ఇక్కడ నుంచి ఎస్సారెస్పీ ప్రాజెక్టు, సోన్ గోదావరి పాతబ్రిడ్జి, కడెం ప్రాజె క్టులను కూడా ఈ కోటలకు లింకేజీ చేశారు. కడెం ప్రాజెక్టు సంద ర్శన తర్వాత కవ్వాల్ అభయారణ్యాన్ని సందర్శించే విధంగా ఈ టూ రిజం కారిడార్‌లో ప్రతిపాదించారు. దీంతో పాటు నిర్మల్ సమీపం లోని కుంటాల వాటర్‌ఫాల్, పొచ్చెర వాటర్‌ఫాల్‌ను కూడా ఈ టూరిజం కారిడార్ పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే ఇప్పటివరకు కూడా ఏ ఒక్క టూరిజం ప్రదేశం వద్ద ఎలాంటి అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టలేదన్న ఆరోపణలున్నాయి. ఈ టూరిజం కారిడార్‌కు సంబంధించి అవసరమయ్యే నిధులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో సంబంధిత అధికారులు పనులు చేపట్ట లేకపోయారంటున్నారు. కేవలం కాగితాలపై ప్రతిపాదనలకే ఈ టూరిజం కారిడార్‌ను పరిమితం చేశారే తప్ప ఎక్కడ కూడా చిత్త శుద్ధితో నిధుల మంజూరు కానీ పనులు చేపట్టడం కానీ జరగక పోవడం జిల్లా పర్యాటక రంగానికి శాపంగా మారిందని అంటు న్నారు.

మొదటి నుంచి నిధుల విడుదలైన నిర్లక్ష్యం

గత రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మల్ జిల్లాలో టూరిజం కారిడార్ కోసం సంబంధితశాఖ అధికారుల చేత ప్రతి పాదనలు రూపొందింపజేసింది. దీనికోసం గాను 50 కోట్ల రూపా యలతో అంచనాలను సైతం అధికారులు తయారు చేశారు. అయితే ఈ ప్రతిపాదనకు అనుగుణంగా రాష్ట్ర టూరిజం శాఖ కమిషనర్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు ఇక్కడి పలు పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. ఈ ప్రదేశాల్లో చేట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా సూచనలు జారీ చేశారు. అలాగే నిధులు మంజూరు విషయమై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి నివేదికలు అందించారు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ ప్రతిపాదనలను కాగితాలకే పరిమితం చేసి చేతులు దులుపుకుంది. ఎక్కడ కూడా నయా పైసా విడుదల చేయకపోవడంతో ఈ ప్రతిపాదనలు నిలిచిపోయాయి.

నిధుల కొరతతో నిలిచిపోయిన హరిత రిసార్ట్...

టూరిజం కారిడార్‌ను రూపొందించే క్రమంలో నిర్మల్‌ను సెంటర్ పాయింట్‌గా చేసుకోవాలని ప్రతిపాదించారు. ఇప్పటికే నిర్మల్‌లో అనుకూలమైన రవాణా సౌకర్యంతో పాటు లాడ్జిలు, ఇతర హోటళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. దీనికి తోడుగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరిత రిసార్ట్‌ను కూడా నిర్మించే ప్రతిపాదనను చేపట్టారు. దాదాపు పది కోట్ల రూపాయలతో ఇక్కడి ఐబీలో హరిత రిసార్ట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఎప్పటికప్పుడు నిధులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం రిసార్ట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిర్మల్‌లో హరిత రిసార్ట్ నిర్మాణం జరిగినట్లయితే పర్యాటకులకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఓవైపు పర్యాటకులకు విడిది సౌకర్యంతో పాటు టూరిజం శాఖకు ఆదా యాన్ని కూడా సమకూర్చే విధంగా ఈ రిసార్ట్‌ను డిజైన్ చేశారు.

కొత్త సర్కారుపైనే ఆశలు

కాగా టూరిజం కారిడార్‌కు అవసరమైన నిధులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించాలని కోరుతు న్నారు. ఓ వైపు యాత్రికులను ఆహ్లాదంతో పాటు మరోవైపు సర్కా రుకు ఆదాయాన్ని సమకూర్చే ఈ కారిడార్ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామంటూ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక టనపై జిల్లావాసులు, యాత్రికులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకుంటు న్నారు. నిలిచిపోయిన హరిత రిసార్ట్ పనుల కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని కోరుతు న్నారు. అలాగే బాసరకు మాస్టర్‌ప్లాన్ కోసం నిధులను, కడెం ప్రాజెక్టు, కవ్వాల్ అభయారణ్యంతో పాటు తదితర వాటి అభివృద్ధికి కూడా అవసరమైన మేరకు నిధులను విడుదల చేయాలంటున్నారు. జిల్లాకు చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై అవసరమైన మేరకు ఒత్తిడి తీసుకువచ్చి నిధులు విడుదలయ్యేం దుకు చొరవ తీసుకోవాలంటు న్నారు.



జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బీ వసతిగృహం వద్ద నిర్మాణానికి నోచుకోని హరితరిసార్ట్

కొనుగోలు కేంద్ర నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 28 : జిల్లాలో వరిపంట కోతకు వచ్చిన తరుణంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ ఆదేశించారు. గురువారం డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో పాటు లారీ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరిని సరైన తేమ శాతం వచ్చిన తరువాతనే లోడింగ్ చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సమస్యలు తలెత్తితే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. వేసవి తాపం పెరుగుతున్నందున తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని సూచించారు. లారీ లోడ్ అయిన తరువాత అన్ లోడింగ్ అయ్యేవరకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని, జియో ట్యాగింగ్ తదితర విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు ప్రక్రియకు లారీ అసోసియేషన్ సభ్యులు సహకరించాలన్నారు. సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, డీసీఎస్‌వో నందిని, డీసీవో నర్సయ్య, మార్కెటింగ్ ఏడీ అశ్వక్, తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప దేవాలయాన్ని దర్శించుకున్న కూచాడి



కూచాడి శ్రీహరి రావును శాలువాతో సన్మానిస్తున్న పూజారి

సారంగాపూర్, మార్చి 28 : మండల కేంద్రంలో గల ఊరగుట్ట మీద ఇటీవలే నిర్మించిన బీరప్ప దేవాలయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు దర్శించుకొని ఆలయంలో మొక్కులు మొక్కారు ఆలయ పూజారి హారతినిచ్చి పూజలు చేశారు. అనంతరం కుర్మ సంఘ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. దీంతో ఆలయ విశిష్టత వివరాలను ఆలయ పూజారిని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపీటీసీ వెంకట రమణా రెడ్డి, నాయకులు గాజుల రవి, దశరథ్, బోలోజి నర్సయ్య, రాజేశ్వర్, నారాయణరెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూర్ణాహుతి పూజ చేస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, మార్చి 28 : మండలంలోని కాల్వలో గురువారం గోవిందమాంబ సహిత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వేద పండితులు శ్రీమాన్ చక్రపాణి నరసింహమూర్తి, చక్రపాణి వాసుదేవాచార్యుల వారి ఆధ్వర్యంలో నిత్యనిధి శాల ప్రవేశం, పుణ్యాహ వాచనం, స్థాపిత దేవతా ఆరాధనలు, ప్రాణప్రతిష్ట హోమాలు, సింహాసన ప్రతిష్ట, యంత్ర శిఖర ఇతర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూర్ణాహుతి పూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాల్వ దేవస్థానం చైర్మన్ మహేష్, మాజీ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, ఇప్ప నర్సారెడ్డి, చిన్నయ్య, నర్సయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలి : కలెక్టర్



అనుమతులపై సూచనలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 28 : లేఔట్లు, భవన నిర్మాణాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా స్థాయి లే ఔట్ కమిటీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాలు నిలిపి వేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ, మండల ప్రాంతాల్లో మార్గదర్శకాలు పాటించాలన్నారు. నూతన లే ఔట్లకు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్‌వాటిని పరిశీలించి అనుమతి ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు కమిటీ బృందం పరిశీలించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఇంజనీరింగ్ అధికారులు శంకరయ్య, అశోక్‌కుమార్, మున్సిపల్, పంచాయతీశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెడతాం

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ నాయకుల ఆందోళన

నిర్మల్ అర్బన్, మార్చి 28 : గత ప్రభుత్వ హయాంలో నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన అవినీతి అక్రమాలను అధికార కాంగ్రెస్ పార్టీ కాపాడుతోందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోఫీనగర్‌లో ప్రభుత్వభూమిలో కట్టిన డీమార్ట్ విషయంలో అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. డీమార్ట్ ల్యాండ్ విషయంలో స్వయంగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ఆదేశాలు ఇచ్చినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులే డీమార్ట్ కట్టిన భూమి ప్రభుత్వానిదేనని సర్వేపై చేసిన అధికారులే మళ్లీ ఎలా అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. దొంగపత్రాలు సృష్టించి తాత్కాలికంగా డీమార్ట్‌ను ఓపెన్ చేయించిన త్వరలోనే అక్కడి ప్రభుత్వభూమిపై చర్యలు తీసుకునేలా రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని న్యాయ పోరాటం కూడా చేస్తామన్నారు. సోఫీనగర్‌తో పాటు గాజులపేట, వెంకటాపూర్, అయ్యప్ప టెంపుల్ ఇలా చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ, దేవాదాయ భూముల విషయంలోనూ అధికారుల తీరు నిర్లక్ష్యంగానే ఉందన్నారు. జిల్లా అధికారులు నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోకపోతే బీజేపీ నేతలంతా కాషాయ జెండాలు ధరించి గాజులపేటలోని శ్రీకృష్ణ దేవాలయం భూములు కాపాడుకునేందుకు ఆందోళనకు దిగుతారన్నారు.

అడిషనల్ కలెక్టర్‌తో జిల్లా బీజేపీ నాయకుల సమావేశం...

డీమార్ట్ భూమి ముమ్మాటికీ ప్రభుత్వ భూమేనని, వాస్తవాలు చెప్పకుండా తప్పుదోవ పట్టిస్తే న్యాయపోరాటం చేసి, భూమి స్వాధీనం చేసుకుని, పేదలకు పంచిపెట్టే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి తెలిపారు. బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అధికారులు ఈ విషయంలో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

మాజీ మంత్రి అవినీతిని కాంగ్రెస్ కాపాడుతోంది

మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అవినీతి అక్రమాలను కాంగ్రెస్ పార్టీ కాపాడుతోందని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచిపెడతామన్నారు. డీమార్ట్ విషయంలో అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాలు ఇచ్చిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా ముగిసిన రేణుక ఎల్లమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మార్చి 28 : నిర్మల్ సమీపంలోని అక్కాపూర్ గ్రామ సమీపంలో గత ఐదు రోజులుగా కొనసాగిన రేణుక ఎల్లమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. రేణుక ఎల్లమ్మ, జమదగ్ని, పరుశరాముడు, ఆది వినాయకుడు సహా ఇతర దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మధ్యాహ్నం ఐదు రోజులుగా నిర్వహించిన మహా యాగశాల పూర్ణాహుతితో సంపూర్ణం చేశారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో రేణుక ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. దైవాజ్ఞ గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ, జమదగ్ని కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ శోభ సత్యనారాయణ గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కే. రామ్‌కిషన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జి. ఈశ్వర్, సహకార సంఘం చైర్మన్ గంగాధర్, కాలేశ్వరం ఆలయ కమిటీ డైరెక్టర్ దేవేందర్‌ర ఎడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు, గౌడ సంఘం ప్రతినిధులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

100 డయల్‌కు వెంటనే స్పందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

దిలావర్‌పూర్, మార్చి 28 : 100 డయల్‌కు వెంటనే స్పందించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ సందర్భంగా కేసుల పురోగతిపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎస్సై సుమాంజలికి పలు సూచనలు చేశారు.


వన్యప్రాణులను కాపాడుకుందాం



కుంటాల అడవిలో వాగును పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కుంటాల, మార్చి, 28 : వేసవి కాలంలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో రాథోడ్ రమేష్ అన్నారు. గురువారం కుంటాల మండలంలోని అటవీ ప్రాంతంలో వాగులు, వంకలను వారు పరిశీలించారు. అటవీ ప్రాంతంలో అక్కడక్కడ ప్రస్తుతం వన్యప్రాణులకు తాగేందుకు నీరు ఉందని నీరు దొరకని సమయంలో ట్యాంకర్ల ద్వారా నీటి తొట్టిలలో నీరు నిల్వ ఉంచేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో స్రవంతి, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



కుంటాలలో బాలింతలకు సూచనలు అందిస్తున్న వైద్యాధికారి శృతి

కుంటాల, మార్చి, 28 : మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శృతి అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మకోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలింతల ఆరోగ్యం కోసమే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు ప్రసవం తర్వాత ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్య సిబ్బందిని సందర్శించి వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.



ఈశ్రామ్ కార్డు ఉన్న కార్మికులకు క్లెయిమ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 28 : జిల్లాలో అసంఘటిత రంగ ఈశ్రామ్ కార్డులు ఉన్న కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు క్లెయిమ్‌లు సకాలంలో చెల్లిం చేలా చర్యలు తీసుకోవాలని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అధికారులను కోరారు. సారంగాపూర్ మండలం ధని గ్రామానికి చెందిన శేఖర్ ఇటీవల మేస్త్రి పని చేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందగా, బాధితులు కలెక్టర్ కార్యాలయంలో క్లెయిమ్ సొమ్ము ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఈ పథకం అమలు అగమ్యగోచరంగా మారిందని సాంకేతిక లోపాలు సవరించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటి వరకు ఒక్క క్లెయిమ్ కూడా కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదివాసీల జోలికి వస్తే సహించేది లేదు

తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంద మల్లేష్

నిర్మల్ అర్బన్, మార్చి 28 : బ్లాక్‌మెయిన్ రాజకీయాలు చేస్తూ ఆదివాసీలపై ఆధిపత్యం సాధించాలని వలస వాదులు చేసే కుట్రలు తిప్పికొడతామని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంద మల్లేష్, వెంకగారి నర్సయ్య (సత్య) అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఆదివాసీలకే ఇస్తారా అంటూ బ్లాక్‌మెయిన్ చేస్తున్న రాజేష్‌బాబు నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలవాలని సవాల్ విసురుతున్నాం. ఆయా రాష్ట్రాల నుంచి వలస వచ్చి బ్లాక్‌మెయిన్ చేస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఏ పార్టీ అయినా ఆదివాసి అభ్యర్థిని గెలిపించుకుంటామని, ఎవరు అడ్డుపడ్డ ఆదివాసీలు గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఆదివాసీలకే టికెట్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసి అభ్యర్థులను ఎన్నుకుంటామని, మిగతా కులాలు కూడా తమకే మద్ధతు ఇస్తున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వలస వాదులు ఆధిపత్యం ఎక్కువైపోయిందని ఏ ప్రభుత్వ కార్యాలయంలో వారి ఆధిపత్యమే ఉండడం, ఇతర కులాలని కూడా అణగదొక్కే ప్రయత్నం చేస్తారని, వారికి రాజకీయంగా అవకాశం ఇస్తే ఇక ఇతర కులాలకు, తెగలకు అవకాశం ఉండదన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, సాకి లక్ష్మణ్, సుంచు శ్రీనివాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి

● నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధనరాజ్



మాట్లాడుతున్న ధనరాజ్

నిర్మల్ కల్చరల్, మార్చి 28 : హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల తదితర వివరాలు ఎప్పటికప్పుడు హెచ్‌ఎంసీఐ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ సూచించారు. గురువారం నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల వివరాలు సైతం నమోదు చేయాలన్నారు. క్షయ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. ఆరోగ్య లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన చర్యలపై తెలియజేశారు. డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఉపవైద్యాధికారి రాజేందర్, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖానాపూర్, మార్చి 28 : ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారులుగా గోనె శ్రీనివాస్, షబ్బీర్‌పాషా, ఆసీఫ్ వ్యవహరించారు. అధ్యక్ష పదవి కోసం న్యాయవాదులు మంత్రరాజం సురేష్, బక్కశెట్టి కిషోర్ నామినేషన్లు పోటీ పడగా ప్రధాన కార్యదర్శి పదవి కోసం నేరెళ్ల సత్యనారాయణ, మట్టేరి రాజశేఖర్‌లు పోటీ పడ్డారు. కాగా తొలుత ప్రధాన కార్యదర్శి ఫలితాలు ప్రకటించగా నేరెళ్ల సత్యనారాయణకు 15 ఓట్లు, మట్టేరి రాజశేఖర్‌కు 11 ఓట్లు రావడంతో ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. తదుపరి ప్రకటించిన అధ్యక్షుడి ఎన్నిక ఫలితాలలో మంత్రరాజం సురేష్‌కు 13 ఓట్లు, బక్కశెట్టి కిషోర్‌కు 13 ఓట్లు రావడంతో ఫలితం టై అయ్యింది. దీంతో ఇరువురు అభ్యర్థుల ఒప్పందం మేరకు ఎన్నికల అధికారులు లక్కీ డ్రా పద్ధతిన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ లక్కీ డ్రాలో అదృష్టం మంత్రరాజం సురేష్‌ను వరించింది. దీంతో అధ్యక్షులుగా మంత్రరాజం సురేష్, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల సత్యనారాయణలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఖానాపూర్ ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద భద్రతను ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు.


















వడ్డాడి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాణ్యత లోపిస్తే చర్యలు : ఎంపీడీవో

తాంసి, మార్చి 28: ఉపాధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని వడ్డాడి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వారికి నీడ, తాగునీటి సౌకర్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఉపాధి హామీలో పని చేస్తున్న ఉద్యోగులు తమ విధులను బాధ్యత యుతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి : దుర్గం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 28: నేతకాని సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన గుమ్మడికుమార్‌స్వామి వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారెడ్డి,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సర్పే సోంబాయిలు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గుమ్మడి కుమార్ స్వామి నేతకాని సమాజాన్ని కించపరిచేలా, తమ మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పి ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓ కులాన్ని దూషించేలా, అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సరికాదని మండిపడ్డారు. నేతకాని జాతికి నీతి లేదంటూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. సామాజిక ఉద్యమాలు, పోరాటాలలో తమ జాతి ముందుండి పోరాడిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో దుర్గం నారాయణ, జాడి లక్ష్మణ్, రాంచందర్ మహాత్మే, జాడి విటాబాయి, రాహుల్ జాందాడే, సూరజ్, సోన్ కాంబ్లె, తదితరులు పాల్గొన్నారు.

మట్కా జూదరుల అరెస్ట్

భీంపూర్, మార్చి 28: భీంపూర్ పోలీసులు గురువారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో గోవిందపూర్ వద్ద ముగ్గురు మట్కా జుదరులను పట్టుకున్నారు. వీరిలో మహారాష్ట్ర పటోధాకి చెందిన భగత్ జైశ్వాల్, భీంపూర్ మండలం కమట్ వాడకు చెంది కరాడే సౌరబ్, బెల్సారీ రాంపూర్ కి చెందిన సిడం జంగూలు ఉన్నారు. వీరి నుంచి 3240 రుపాయాలను, మూడు మట్కా బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపమని ఈ సందర్భంగా ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. మాట్కా నిర్వహించే వారిని, అడేవారిని పట్టుకొని కటిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అన్నారు.



మట్కా జూదరుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై కుమార్

ఎట్టకేలకు రామలింగంపేట్ వంతెన నిర్మాణం

● హర్షం వ్యక్తం చేస్తున్న ఏజెన్సీ గ్రామాల ప్రజలు

ఉట్నూర్, మార్చి 28: మండలంలోని రామలింగంపేట వాగుపై ఎట్టకేలకు వంతెన నిర్మాణం పూర్తి కావస్తుంది. ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు దగ్గరి దారిగా ఉన్న రాంలింగంపేట ఉట్నూర్ రహదారి పైదశాబ్దాలుగా వంతెన నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తూ వస్తున్నారు. సుమారు 50ఏళ్ల క్రితం ఈ రోడ్డు గుండా ఉట్నూర్ నుంచి పాత ఉట్నూర్, రామలింగంపేటల మీదుగా హస్నాపూర్, నార్నూర్‌లకు ప్రైవేట్ సర్వీసు నడిచేది. వాగు ప్రవాహం ఉన్న రోజులలో సర్వీసు రద్దు కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రైవేట్ వాహణాలు కచ్చదారి పైనే నడిచేలా అధికారులు అనుమతులు ఇవ్వడంతో కచ్చాదారి పైనే ప్రైవేట్ వాహనాలు నడుస్తూ ఉండేవి. ఉట్నూర్ నుంచి హస్నాపూర్‌కు వెళ్లాలంటే రోడ్డు భవనాల శాఖ రహదారి పైన 10 కి.మీ. వెళ్లాల్సి వస్తుంది. ప్రస్తుతం హస్నాపూర్ శంకర్‌తండా సమీపంలోని రోడ్లు భవనాల శాఖ రహదారి నుంచి రామలింగాపేట ఉట్నూర్ చేరుకోవాలంటే నాలుగు కిలో మీటర్ల లోపే ఉంటుంది. రెండు దశాబ్దాల క్రితం అప్పటి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆధ్వర్యంలో రూ.3.75 కోట్లు రోడ్డు, వంతెన పనుల నిర్మాణం కోసం మంజూరు చేయించారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో 2023లో పనులు ప్రారంభించినప్పటికీ ఈ పనులు నత్తనడకన నడుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్‌బి రహదారి నుంచి రామలింగపేట వరకు కారు రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ వాగుపై వంతెన పనులు చేపట్టడంలో నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. తారు రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో వాహణదారులు అధిక శాతం మంది ద్విచక్ర వాహనాలు, కార్లు జీపులు ఆటోలతో ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నారు. రెండు రోజుల క్రితం వంతెనపై స్లాబు వేసిన కాంట్రాక్టర్‌కు ఈ పనులు పూర్తి చేయడానికి మరో రెండు నెలల సమయం పట్ట వచ్చని భావిస్తున్నారు. వర్షాకాలం లోపు ఈ పనులు పూర్తి చేయడం జరుగుతుందని ఐటీడీఏ ఏఈ రాథోడ్ ఇందల్‌సింగ్ తెలిపారు.



నిర్మాణం పూర్తికావొస్తున్న రామలింగం పేట్ వంతెన



నిర్మాణం పూర్తయిన తారు రోడ్డుపై ప్రయాణిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలు



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి'

బోథ్ రూరల్, మార్చి 28: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు అర్హత ఫీజు తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఫీజు పెంచడం వల్ల పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం ఫీజు తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు మల్లెపూల సుభాష్, భీమా, బుచ్చన్న మల్లెపూల స్వామి, కాడి రాజేందర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మావల, మార్చి 28: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పోలీస్ సేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సయ్యద్ ముజహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం కొత్తగూడకు చెందిన దేవర్తి శివయ్య 48 పాల వ్యాపారం చేస్తుంటాడు. గత కొంత కాలం మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపంతో జీవితం మీద విరక్తి చెంది గ్రామ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్త చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

● బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

గుడిహత్నూర్, మార్చి 28: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, నరేంద్రమోదీ మూడో సారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. గురువారం మండలంలోని డోంగ్రా గావ్ గోశాలలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మనంద్ మాట్లాడుతూ దేశం మరింత అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలని ప్రధానిగా నరేంద్ర మోదీ రావాలన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, మండల అధ్యక్షుడు జాడి సుభాష్, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ చంద్ర, నాయకులు పాయల్ శరత్, విజయ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: క్షేత్రస్థాయిలో ప్రతీ నాయకుడు, కార్యకర్త చేయి చేయి కలిపి అకుంఠిత దీక్షతో పని చేసి నరేంద్రమోదీకి ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని బహుమతిగా ఇవ్వాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఇందులో మండల కన్వీనర్ నాయకులు, సంతోష్‌సింగ్, భీంరెడ్డి, గాదె శంకర్, ఆడెపు నరేందర్, రమేష్, రమణ, రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్‌చంద్ర, తాంసి జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, సర్పంచ్ పాయల శరత్, జ్ఞానసుధ, ఆకుల రాజు, ప్రేంసింగ్, కమల్‌సింగ్, రవీందర్, కైలాస్, లక్ష్మణ్, కోటేశ్వర్, కృష్ణ, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ రూరల్: తాను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అండగా నిలవాలన్న ధృక్పథంతో కార్యకర్తల అభీష్టం మేరకు బీజేపీ ఎంపీ అభ్యర్థిగా మీ ప్రతినిధిగా బరిలోకి రావడం జరిగిందని బీజేపీ ఎంపీఅభ్యర్థి జి.నగేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సోనాల గ్రామంలో కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. గతంలో మంత్రిగా ఎమ్మెల్యేగా ఎంపీగా పనిచేసిన తనకు సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండడం వల్ల ఎంపిగా బీజేపీ బరిలో దిగాలని ఆలోచించి టికెట్‌లు కేటాయించిందన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో సమస్యలపై పూర్తిస్థాయిలో అవగహన ఉందన్నారు. గతంలో ప్రతిపక్ష ఎంపిగా ఉన్న బోథ్ నియోజకవర్గానికి రూ.375 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. పోచ్చెర ఎక్స్ రోడ్ నుంచి ఘన్పూర్ వరకు 36 కోట్ల రూపాయలు తీసుకురావడం జరిగిందని జాతీయ రహదారి నుండి బోథ్ వరకు రోడ్డు నిర్మాణానికి 12 కోట్ల రూపాయలు తీసుకురావడం జరిగిందన్నారు. దీనికి మరొక రోడ్డు నిర్మాణానికి 19 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ఇక బీజేపీలో పాత నాయకులు కొత్త నాయకులు అనే భేదాభిప్రాయాలు లేకుండా పార్టీకి పనిచేసే ఎక్కువ ఓట్లు తీసుకుకొచ్చిన వారికి పార్టీలో భవిష్యత్తు ఉంటుందన్నారు. కండువాలు వేసుకొని ఖద్దరు ధరించిన వారు పార్టీలో ఉండడంలో తప్పు లేదని ఓట్లు రాబట్టిన వారే నిజమైన నాయకుడు అన్నారు. సంకల్పంతో పని చేసినట్లయితే పార్టీ గుర్తిస్తుందన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ ప్రజలను చేతకాని హామీలతో మోసగించడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసగించేదిగా మాట్లాడుతున్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ప్రధానిని మోది నాయకత్వం అవసరం అన్నారు. ఆ తర్వాత సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ మాట్లాడారు. ఇందులో మండల పార్టీ కన్వీనర్ సుభాష్, సూర్య నాయకులు ఐటీడీవో డైరెక్టర్ భూమన్న, సోనాల గ్రామ నాయకులు సదానంద్, బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు జి. రాజు యాదవ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జివి. రమణ, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని స్థానిక తిరుమల గార్డెన్‌లో బీజేపీ మండల కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలం, బలగం పార్టీ కార్యకర్తలే అని అన్నారు. అనంతరం మండలంలోని బీఆర్ఎస్ నాయకులు గోడం నగేష్ ఆధ్వర్యంలో పెద్ద మొత్తంలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, మండల అద్యక్షుడు బత్తిని సుధాకర్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవల్ సింగ్, రాజుయాదవ్, కొత్త శంకర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.



డోంగ్రా గావ్ గోశాలలో మాట్లాడుతున్న గోడం నగేష్

నర్సాపూర్ (జి) పోలీసు స్టేషన్‌ను

ఆకస్మిక తనిఖీ చేసిన డీఎస్పీ గంగారెడ్డి



పోలీసుస్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నర్సాపూర్(జి), మార్చి 28 : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం డీఎస్పీ గంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతిని ఎస్సై మునిగెల హన్మాండ్లును అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతీ దరఖాస్తు రెండు రోజుల్లో తెలంగాణా రాష్ట్ర పోలీసు డిపార్ట్‌మెంట్ పోర్టల్‌లో పొందుపర్చాలని సూచించారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాంరావుపాటిల్

కుభీర్ మార్చి 28 : మండలంలోని గోడాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలోకి చేరారు. వారిని ఎమ్మెల్యే రాంరావుపాటిల్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మోరె దత్త హరిపటేల్, మాజీ సర్పంచ్ దిగంబర్‌పటేల్, మోరె నారాయణ్‌రావు పటేల్, నాయకులు, గ్రామస్థులున్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

● ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్

కుంటాల, మార్చి, 28 : మండలంలోని ఆయా గ్రామాలలో సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతీ మూడు నెలలకు ఒకసారి మండల కేంద్రం కుంటాలలో నిర్వహించే సర్వసభ్యసమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరవడం పట్ల ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రం కుంటాలలో స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అప్కగజ్జారాం యాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో ప్రజా ప్రతినిధులు తాము సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలని గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ స్థానిక అధికారులకు సూచించారు. అనంతరం హాజరైన పలువురు అధికారులు వారి వారి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో రహీం, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నారు.

ముథోల్ మండలంలో జాతీయ క్షయ నిర్మూలన దినం

ముథోల్, మార్చి 28 : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం మండల వైద్యాధికారులు ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ... క్షయ వ్యాధి నిర్మూలనకు చేపట్టవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. క్షయవ్యాధి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ అని ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందన్నారు. విడువని దగ్గు, తుమ్మడం, ఉమ్మి వేయడం ద్వారా గాలిలో కలుస్తుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉంటే డాక్టర్లను సంప్రదించి చికిత్స చేసుకోవాలన్నారు. సకాలంలో పూర్తిస్థాయిలో చికిత్స తీసుకుంటే సత్వరమే కోలుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రోగులకు ఉచితంగా మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా. విజయానంద్, డా. సాయి వర్ధన్, ఎంవో డా. రాహుల్, టీబీ సూపర్‌వైజర్ ఎస్. లాలయ్య, హెడ్ నర్స్ పద్మ, ఏఎన్ఎం విజయ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రమాణం చేస్తున్న వైద్య సిబ్బంది

'తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి'

ఆసిఫాబాద్, మార్చి 28: గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలతోపాటు సీసీ రోడ్లు, ఇంటిపన్నుల వసూలు తదితర పనులను ప్రణాళికబద్ధంగా పూర్తి చేయా లని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు పంచాయతీ అధికారి సురేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, ఉమర్ హుస్సేన్‌తో పాటు పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీల్లో వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చేతి పంపులు, పంపుసెట్లు, మిషన్ భగీరథ పైపులు ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. లీకేజీ సమస్యలు పరిష్కరించాలన్నారు. నీటిఎద్దడి ఉన్నచోట ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో అన్నిగ్రామాల్లో ఈనెల31 వరకు వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, మండల పంచాయతీ అధికారి, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎనోలి గ్రామాన్ని సందర్శించారు.

పత్తి రైతులపై విత్తన భారం



● గతేడాది కంటే ఒక్కోప్యాకెట్‌పై రూ.11 పెరుగుదల
● జిల్లాలో రైతులపై రూ.కోటిపైనే భారం
● 3.5లక్షల ఎకరాల్లో సాగు అంచనా
● 7లక్షల పైనే విత్తన ప్యాకెట్లు అవసరం

చింతలమానేపల్లి, మార్చి 28: పత్తి విత్తనాల ధరలు ప్రతీ ఏటా కొంత పెరుగుతుండడంతో రైతులకు భారం తప్పడం లేదు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.11 పెరి గింది. దీంతో జిల్లాలో రైతులపై రూ.కోటిపైనే భారం పడనుంది. జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి పంట ఒకటి. వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ధరను నిర్ణయించింది. అయితే ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరుగడంతో ఇప్పటికే ఖర్చులు విప రీతంగా ఉన్నాయని రైతులు పేర్కొంటుండగా పత్తి విత్తనాల పెరుగుదల గుదిబండగా మారిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

● జిల్లాలో 3.5లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 15మండలాల పరిధిలో ప్రధానపంటగా పత్తిని సాగు చేస్తుండగా అత్యధికంగా గతేడాది జిల్లా వ్యాప్తంగా 3.4లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది సైతం సుమారుగా 3.5లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉంది. దీంతో ఎకరాకు 2ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉన్నా 7లక్షలపైనే పత్తి విత్తనప్యాకెట్లు అవసరం అవుతాయి.

గతేడాది ఒక్కో పత్తివిత్తన ప్యాకెట్ ధర రూ. 853 ఉండగా, ఈ ఏడాది ఒక్కోప్యాకెటుకు రూ.11 పెంచడంతో రూ.864కు చేరింది. జిల్లా మొత్తంగా కోటి పైనే రైతులకు భారం పడనుంది. పత్తి విత్తనాలకు రైతులు ప్రైవేటు కంపెనీల పైనే ఆధారపడుతున్నారు. మార్కెట్‌లో బీటీ-1, బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నా, ఎక్కువ మొత్తంలో బీటీ-2 రకం పత్తి విత్తనాలనే వాడుతుంటారు. సీజన్ ప్రారంభం అయిందంటే అనేక కంపెనీలు వివిధ రకాల పేర్లతో మార్కెట్లకు విత్తనాలను విడుదల చేస్తాయి.

● రెండు, మూడు కంపెనీలకే డిమాండ్

మార్కెట్లో వందల రకాల విత్తన కంపెనీలు ఉంటున్నా రెండు, మూడు కంపెనీలకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఒక్కో పత్తి ప్యాకెట్ ధర ఈ ఏడాది రూ.864 ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన ధరకే డీలర్లు రైతులకు ఇస్తారు. డిమాండ్ ఉన్న పత్తిప్యాకెట్లకు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా విక్రయించే అవకాశం ఉంది. డిమాండ్ ఎక్కువ ఉన్న పత్తి విత్తనాలు కావాలని రైతులు డీలర్ల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి. గతేడాది సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

కొందరు డీలర్లు ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మి రైతులను నట్టేట ముంచారు. అయితే ఇలాంటి పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతు న్నారు. ఇప్పటికే వ్యవసాయంలో ఖర్చులు ఏటేటా పెరిగిపోతుండగా ఈ ఖర్చు మరింత భారం కానుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ప్రాణాపాయ స్థితిలో వైద్యురాలు



హర్షవర్ధన్

ఆసిఫాబాద్, మార్చి 28: తిర్యాణి మండల కేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్న హర్షవర్ధన్ ప్రేమించి మోసం చేసిన వైద్యురాలు ప్రియాంక ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. పవిత్రమైన వైద్యవృత్తిలో ఉంటూ అక్కడే పని చేస్తున్న ఇద్దరు లేడీడాక్టర్లతో ఒకరికి తెలియకుండా మరొకరితో ప్రేమాయణం కొనసాగించాడు డాక్టర్ హర్షవర్ధన్. పెండ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇటీ వల ప్రియాంక జైనూరు మండలానికి మరొక వైద్యురాలు మంచి ర్యాలకు బదిలీ అయింది. జైనూరుకు బదిలీపై వెళ్లిన ప్రియాంకను హర్షవర్ధన్ దూరం పెట్టాడు. మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న వైద్యు రాలితో సన్నిహితంగా ఉంటూ పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రియాంక హర్షవర్ధన్‌ను నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తన గురించి చెడుగా మాట్లా డంతో పాటు పెళ్లికి తిరస్కరించాడు. దీంతో ప్రియాంక మనస్థాపానికి గురై తల్లిదండ్రులకు ఫోన్‌చేసి విషయాన్ని వివరించింది. వారు ఆమెను స్వగ్రామమైన మంచిర్యాల జిల్లా కాసిపేటకు తీసుకువెళ్లారు. తీవ్ర మనస్థాపా నికి గురైన ఆమె బాత్‌రూమ్ క్లీన్‌చేసే(హార్పిక్) రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితివిషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

వాంకిడి, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణం గా తనిఖీచేయాలని డీఎస్పీ సదయ్య సిబ్బందికి సూచించారు. గురువారం వాంకిడి ఎస్సై సాగర్‌తో కలిసి మండలంలో ఏర్పాటుచేసిన ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు.

వార సంతలో సౌకర్యాలు కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, మార్చి 28: మండలకేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారసంతలో సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్‌యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ కార్యదర్శి శివకుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం జరిగే వారసంతలో కనీస వసతులు లేకవ్యాపారులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వారసంతలో షెడ్లు లేకపోవడంవల్ల ఎండలో నిలబడి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. వర్షాకాలంలో నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సదుపాయాలు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు జ్యూస్ పంపిణీ

పెంచికలపేట, మార్చి 28: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు జాగృతిఅధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, యువకులు ప్రవీణ్, అనీల్ పాల్గొన్నారు.



పట్టు బిగిస్తున్న.. పార్టీలు!

- ఎట్టకేలకు ప్రధాన రాజకీయ పార్టీల ఎంపీ అభ్యర్థుల ఎంపిక
- టికెట్ దక్కకపోవడంతో ఆశావహ నేతల్లో నిరాశ
- లంబాడాల మద్దతు కోసం నేతల పోటాపోటీ ప్రయత్నాలు
- మరింత ఊపందుకోనున్న జిల్లా రాజకీయాలు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరిన్ని రాజకీయ సమీకరణలు

ఆదిలాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలపై ప్రధాన పార్టీలు పట్టు బిగిస్తున్నాయి. ఎట్టకేలకు అభ్యర్థుల ప్రకటనతో ఉత్కంఠకు తెర పడింది. ఇన్నాళ్లు దీటైనా అభ్యర్థుల కోసం అన్వేశించిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు.. అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేశాయి. పార్లమెంట్ పరిధిలోని సామాజికవర్గాల వారీగా ఓట్ల లెక్కలు వేసుకున్న పార్టీలు.. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ అభ్యర్థులను ప్రకటించాయి. ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు ఆదివాసీలే కావడంతో.. లంబాడా సామాజికవర్గం నేతల్లో అసంతృప్తి కనిపిస్తుంది. మొదట బీజేపీ, ఆ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. కొంత ఆలస్యమైనా కాంగ్రెస్ ఆదివాసీ మహిళా నేతను లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింపేందుకు సిద్ధమయ్యింది. అందరికంటే ముందున్న బీజేపీ అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతోంది. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో మరింత బలపడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్‌లను ఇరుకున పెట్టేందుకు మహిళా నేతకు అవకాశం కల్పించిన కాంగ్రెస్.. పథకాల పేరిట ప్రజల్లోకి వెళ్తోంది. గతంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ధీమాతో కనిపిస్తున్నారు. మోదీ ఈమేజ్, కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలతో సులువుగా గట్టెక్కవచ్చనే భావనతో గోడం నగేష్ ఉన్నట్లు తెలుస్తుంది. గత ఎన్నికల్లో ఆదివాసీ ఉద్యమం బలంగా పని చేయడంతో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు గెలుపు సాధ్యమైంది. ఈసారి ప్రధాన పార్టీలన్నీ ఆదివాసీ అభ్యర్థులనే ఎన్నికల బరిలోకి దింపడంతో సొంత సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల మద్దతు ఎవరికన్నది ప్రశ్నార్థకంగా మారింది.

చేజారిన ఎంపీ టికెట్

గత కొంత కాలంగా టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేసిన ఆశావహ నేతలంతా.. ప్రస్తుతం డీలా పడిపోయినట్లు కనిపిస్తుంది. బీజేపీ టికెట్ కోసం సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుతో పాటు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజేష్‌బాబు చివరి వరకు ప్రయత్నాలు చేసినా.. ప్రయోజనం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పార్టీ అభ్యర్థిని ఖరారు చేయడంతో పూర్తిగా సైలెంటైపోయారు. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌ల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అలాగే అందరిలో ఆశలు రేపిన కాంగ్రెస్ చివరకు ఆదివాసీ మహిళ నేత ఆత్రం సుగుణకు



అవకాశం ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్ దంపతులతో పాటు ఆత్రం భాస్కర్, నరేష్ జాదవ్, డాక్టర్ సుమలతలు పార్టీ తీరుపై అసంతృప్తితో కనిపిస్తున్నారు. ఎంపీ హామీతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ అభ్యర్థి గెలుపునకు సహకరించిన రేఖానాయక్ రాజకీయ భవిష్యత్తు కూడా డైలామాలో పడింది. మొదటి నుంచి పార్టీనే నమ్ముకొని పని చేస్తున్న నేతలను కాదని, ప్రధాన పార్టీలు కొత్త వారికి అవకాశం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఎవరూ ఊహించని రీతిలో కమల దళంలో చేరిపోయిన గోడం నగేష్ బీజేపీ టికెట్ దక్కించుకొని నేతల మద్దతును కూడగడుతున్నారు. రాజకీయాల్లో శాశ్వతమైన శత్రువులు, మిత్రులంటూ ఎవరూ ఉండరని అభ్యర్థుల ఎంపికతో తేలిపోయింది. అయితే రాజకీయాల్లో ఎప్పుడు, ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితులు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లంబాడాల మద్దతు ఎవరికి?

పార్లమెంట్ పరిధిలో లంబాడాల ఓటర్ల మద్దతే కీలకంగా మారింది. సుమారుగా లక్షా 50వేల వరకు లంబాడా సామాజికవర్గం ఓటర్లు ఉన్నట్లు తెలుస్తుంది. ఆదివాసీ ఓట్లను ప్రధాన పార్టీల అభ్యర్థులు తలోకొంత పంచుకున్నా.. లంబాడా సామాజిక వర్గం ఓటర్ల మద్దతు ఎవరికన్నదే చర్చనీయాంశంగా మారింది. ఏఒక్క పార్టీ లంబాడా నాయకత్వానికి ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపించ లేదు. దీంతో ఆ వర్గం నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తుంది. అన్ని పార్టీలలో లంబాడా సామాజికవర్గం నేతలు కీలకంగానే కనిపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల ఆధారంగానే ప్రధాన పార్టీలన్నీ లోక్‌సభ ఎన్నికల్లో ఆదివాసీ నేతల వైపు మొగ్గు చూపాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజక వర్గాలు ఉండగా.. ఇందులో మూడు నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వ్‌డు స్థానాలే ఉన్నాయి. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఆదివాసీల ప్రభావమే కనిపించింది. బోథ్ నియోజకవర్గం మాత్రం లంబాడా సామాజిక వర్గానికి దక్కింది. ఇలాంటి పరిస్థితుల్లోనే ఆదివాసీల వైపు మొగ్గు చూపాల్సి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని పార్టీలు లంబాడాలను పక్కన పెట్టడంతో ఆ వర్గం నేతల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుని ఉమ్మడి అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే జరిగితే ప్రధాన పార్టీల అభ్యర్థులకు కొంత ఇబ్బందికరమైన పరిస్థితే ఏర్పడనుంది. లంబాడాల నేతలు ఎన్నికల బరిలో లేకపోవడంతో వారి మద్దతు ఎవరికన్నదే హాట్ టాపిక్‌గా మారింది.

ఆశావహ నేతల దారెటు?

ఇన్నాళ్లు అవకాశం కోసం వేచిచూసే ధోరణితో కనిపించిన పలువురు ఆశావహ నేతల దారి ఎటు? అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అవకాశం దక్కకపోయినా.. పార్టీనే నమ్ముకుని పని చేస్తారా? లేదా? పార్టీ అభ్యర్థిని ఓడించేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తారా? అనేదే చర్చనీయాంశంగా మారింది. టికెట్ ఆశించి భంగపడ్డ బీజేపీ నేతలు సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌లు కాంగ్రెస్‌లో చేరితే విజయ అవకాశాలు మెరుగుపడుతాయన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఆశావహ నేతలు మాత్రం ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. బీఆర్ఎస్‌కు చెందిన మరి కొంతమంది నేతలు మాత్రం కాంగ్రెస్, బీజేపీల వైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగుతుంది. రాబోయే రోజుల్లో మరిన్ని రాజకీయ సమీకరణలకు అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఆశావహ నేతల రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న చర్చ కొనసాగుతుంది. త్వరలోనే పార్లమెంట్ పరిధిలో మరిన్ని రాజకీయ సమీకరణలకు అవకాశం లేకపోలేదంటున్నారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్



సుంకిడిలో భగీరథ పంప్‌హౌజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తూ..



తలమడుగులో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తూ..

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి
- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్
- పరీక్ష కేంద్రంతో పాటు సరిహద్దులో లక్ష్మీపూర్ చెక్‌పోస్టు తనిఖీ

తలమడుగు, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున.. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో వచ్చిపోయే వాహనాలను క్షుణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోసుట్ల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు ప్రతీ వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని కలెక్టర్ ఈ సందర్భగా కోరారు. అదేవిధంగా ఎలాంటి ఆదారాలు లేకుండా 50వేల రూపాయలకు పైగా నగదును వెంట తీసుకుని వెళ్లద్దని పేర్కొన్నారు. అదే సమయంలో ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర కిన్వట్ వెళ్తున్న ఏటీఎం వాహనం వెళ్లడంతో వాహనాన్ని ఆపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్‌తో సహా నగదుకు సంబంధించిన వివరాలను క్యూఆర్ కోడ్ ద్వారా చూయించడంతో వాహనాన్ని పంపించారు. అంతేకాకుండా మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కుకలిగిన ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో పద్ధ్య సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ శాఖ రెవెన్యూ శాఖ పోలీసు శాఖ అధికారుల సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. వాహనాల తనిఖీ చేసే సమయంలో స్థానిక సిబ్బంది తప్పనిసరిగా ఫొటోగ్రఫీ చిత్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఇందులో మండల ప్రత్యేక అధికారి మహావీర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శేఖర్, ఎస్సై ధనశ్రీ, ఏఎస్సై సురేందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్నందున తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ మిషన్ భగీరథ అధికారులకు ఆదేశించారు. తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ సుంకిడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మీపూర్ గ్రామస్థులని జిల్లా కలెక్టర్ మిషన్ భగీరథ నీటి పై ఆరా తీయగా మిషన్ భగీరథ నీరు గ్రామాల్లో రెండు రోజులు వస్తే నాలుగు రోజులు గ్రామాలకు రావడం లేదన్నారు. దీంతో తాగునీటి కోసం వ్యవసాయం వ్యవసాయ బోరుబావుల నుంచి వాగులవంకల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించడంతో వెంటనే సంబంధిత మిషన్ భగీరథ అధికారులను పిలిచి గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటికి సంబంధించిన నిధులను విడుదల చేశానన్నారు. అనంతరం సుంకిడిలో నిర్మిస్తున్న మిషన్ భగీరత పంప్‌హౌజ్‌ను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. పనులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కాగా మిషన్ భగీరథ పంప్‌హౌజ్ వద్ద స్టోన్ క్రషరలు ఉండడంతో వాటి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని మిషన్ భగీరథ అధికారులు కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో కలెక్టర్ స్టోన్ క్రషర్ల భూములు వివరాలు వెంటనే సర్వే చేయించి రిపోర్టు ఇవ్వాలని తహసీల్దార్ రాజమోహన్‌కు ఈ సందర్భంగా ఆదేశించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలు ఎలాంటి మాస్ పాయింగ్ జరుగకుండా చూడాలన్నారు. విద్యాశాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం పరీక్ష కేంద్రానికి ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎంత మంది విద్యార్థులు ఆప్‌సెంట్ అవుతున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ రాజశేఖర్, ఎస్సై ధనశ్రీలు, మండల ప్రత్యేక అధికారి మహావీర్, ఆర్‌డబ్ల్యూఎస్ రమణ, ఈఈ చంద్రమోహన్, ఏఈ మయమహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనాలు పెరిగాయి

- కూలీల సంఖ్యను పెంచండి : డీఆర్‌డీవో

బోథ్ రూరల్, మార్చి 28: ఉపాధి హామీ కూలీల వేతనాలు ఏప్రిల్ నుంచి రూ.300 పెంచడం జరిగిందని కూలీలు ఉపాధి కార్యక్రమాన్ని విజయవంతం చేసుకునేందుకుగాను ముందుకు రావాలని డీఆర్‌డీవో సాయన్న కోరారు. గురువారం మండల కేంద్రం సమీపంలోని పిప్పలదరి అటవీ ప్రాంతంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు.



బోథ్ సమీపంలోని పిప్పలదరి అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు పెరిగినందున కూలీల సంఖ్య మరింత పెంచాలని ఏపీఓ జగ్గదేరావుకు వివరించారు. వేసవికాలంలో వంద రోజులు పని చేసినట్లయితే కూలీలకు రూ.30 వేలు వేతనంగా ఇవ్వాలని అన్నారు. గతంలో వంద రోజులు కూలీ పనులు చేసిన వారు సైతం ఏప్రిల్ ఒకటి నుంచి నూతనంగా చేపట్టే పనుల్లో పనులు చేసే ఆస్కారం ఉందన్నారు. అన్ని గ్రామాల్లో అధికారులు ఉపాధి హామీ కూలి పనిపై అవగహన కలిగించాలని ఆయన ఈ సందర్భగా పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో చేపట్టిన సీసీటీ పనులను పరిశీలించారు. 162 మంది కూలీలు చేపట్టినపనులను పరిశీలించారు.. ఆయన వెంట ఎంపీడీవో రమేష్, టీఏ మధుకర్, తదితరులు ఉన్నారు.

ఉదయం పూటనే పనులు చేపట్టాలి

నేరడిగొండ: ఉపాధి హామీ పనులను ఉదయం వేళల్లోనే చేపట్టాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున వడదెబ్బ తగిలే అవకాశం ఉందని కూలీలు ఉదయం పూట మాత్రమే పనులు చేయాలన్నారు. పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్సను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలి : ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త



మాట్లాడుతున్న పీవో

ఉట్నూర్, మార్చి 28: గిరిజన గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గురుకుల ప్రాంతీయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్‌ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖుష్బుగుప్త మాట్లాడుతూ మెనూ పాటించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు కూడా తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్‌సీవో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ గిరిజన అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఆత్రం సుగుణ

నా జీవితం ప్రజా సేవకే అంకితం

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణ

ఇంద్రవెల్లి, మార్చి 28: నా జీవితం ప్రజా సేవకు కాంగ్రెస్ పార్టీకే అంకితమని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌తో కలిసి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దేవతను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళ్లి అర్పించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా జీవితం అంతా ప్రజా సేవకేనని కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలకు సేవ చేసే పార్టీ అని ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు డిక్లరేషన్‌లను కచ్చి తంగా ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రజలు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు సోమోరే నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.



నాగోబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తో ఆత్రం సుగుణ

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాపురెడ్డి

ఉట్నూర్, మార్చి 28: ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాపురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ధీరజ్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా బానోతు జగన్, జాయింట్ సెక్రెటరీగా పవర్ వసంత్‌రావు, కోశాధికారిగా గిరి, గ్రంథాలయ కార్యదర్శిగా జైవంత్ రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి బాపురావ్ తెలిపారు.

'దళిత కాలనీలో విద్యుత్ సమస్య తీర్చండి'

బోథ్ రూరల్, మార్చి 28: సోనాలలోని ఒకటి, రెండు వార్డులలో విద్యుత్ సమస్య వేధిస్తుందని, ఫలితంగా ప్రతీరోజు ఉదయం 6:30 గంటల నుంచి దాదాపు మూడు గంటల పాటు విద్యుత్ సమస్యకు అంతరాయం కలుగుతుందని ఆ కాలనీవాసులు వీడీసీ ఉపాధ్యక్షుడు భీమ్రావు తెలిపారు. కాలనీలో నుంచి ఒక డీటీఆర్‌ను తొలగించడం జరిగిందని, దీంతో వేసవికాలంలో నీ చేతితో డిమాండ్ పెరగడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతారాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. తొలగించిన డీటీఆర్ స్థానంలో మరో డీటీఆర్‌ను ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఇఫ్తార్ విందును జయప్రదం చేయాలి

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 28: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఉందని తెలిపారు. 1500మందికి పైగా విందులో పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు ఆచరించేందుకు తగు ఏర్పాట్లు చేశామని, అన్ని మసీదుల ఇమామ్‌లు, సదర్లు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మరోవైపు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతు అవుతుందని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జహీర్‌రంజాని, నాయకులు సాజిదొద్దిన్, యూనిస్‌అక్బాని, రోకండ్ల రమేష్, ఆసీఫ్, సలీంపాషా, అన్సర్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటాం'

బోథ్ రూరల్, మార్చి 28: ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణకు టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ సోనాల మండల కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం పరుస్తూ స్వీట్లు పంచుకున్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని తీరుతామన్నారు. ఈ సంధ్బంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఒక తాటిపైకి వచ్చి ముందుకు సాగుతామంటూ ఈ సందర్భంగా వారు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్	సహర్
సా.6.34	ఉ.4.50



అల్లాహ్ మార్గంలో ఒక ఉదయం లేదా ఒక సాయంత్రం గడిపినందు వల్ల లభించే పుణ్యం.. ప్రపంచంలోని సంపదలు అన్నింటి కన్న ఉత్తమం.